క్లుప్తంగా

మహిళా సమైక్య ఖాతాల ఆడిటింగ్



మాచర్ల: పట్టణంలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో రెండు రోజులుగా గుంటూరుకు చెందిన అజాద్ అండ్ కో ఆడిటర్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా సమైక్య గ్రూపుల ఖాతాల ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. మెప్మా మేనేజర్ సుబ్బారావు, రాజశేఖర్, అంజలిల ఆధ్వర్యంలో ఆడిటర్లు నరేంద్ర, రాజేష్‌తో పాటు ప్రతి గ్రూపునకు సంబంధించిన పుస్తకాలను పరిశీలించారు. 827 గ్రూపులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు.

క్రీస్తు బోధనలతో శాంతి



మాచర్ల: క్రీస్తు బోధనలతో మానవాళికి శాంతి లభిస్తుందని చెన్నై పాస్టర్లు బ్రదర్ జాన్ హైడ్, పీటర్ పాల్ అన్నారు. పట్టణంలోని మిస్సమ్మ ఆస్పత్రిలో జరిగిన క్రీస్తు సువార్త కూటముల్లో వారు క్రీస్తు సందేశాలు ఇచ్చారు. ది లెమన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈ కూటములు జరుగుతున్నాయి. అనంతరం సంఘ కాపరి బ్రదర్ ప్రభాకర్‌రావు అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు క్రైస్తవ మహిళలు క్రీస్తు గీతాలు ఆలపించారు.

కాలుష్య నియంత్రణపై కళాజాత

పిడుగురాళ్ల: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా 2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రచార కళాజాత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో కళాజాత నిర్వహించి పలువురికి కాలుష్య నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో కళాభారతి కల్చరల్ ట్రూప్ సభ్యులు ఎం.శ్రీశైలం, శివ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత



గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమానికి కూచర్లగుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కావూరి రామారావు శుక్రవారం నిత్యావసర వస్తువులు అందించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు నిఖిల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గూడూరి జానకిరామ్, ఆశ్రమ నిర్వాహకుడు చింతకాయల ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



గురజాల : క్రీడలతో మానసికోల్లాసం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, సీడీపీఓ షేక్ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని అంగన్ వాడీ కేంద్రంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడలతో పోటీతత్వం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వై.రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

పీఆర్కేకు నేతల అభినందన




విజయపురిసౌత్: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయటంతో శుక్రవారం విజయపురిసౌత్ గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు పిన్నెల్లిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వీరిలో వైఎస్సార్ సీపీ నాయకులు బూడిద శ్రీను, తంగిరాల రామిరెడ్డి, కారే మునలయ్య, పూరి, జిలాని, అరవపల్లి సుమన్, ఇస్మాయిల్, లక్ష్మీనారాయణ, భూలోక, మల్లి శ్రీను, లాకా వెంకటరమణ ఉన్నారు.

‘హామీ’తుమీకి ప్రజలు సిద్ధం

సూపర్‌సిక్స్ పథకాలకు మంగళం పాడిన సీఎం చంద్రబాబులాగే మాచర్ల, గురజాల కూటమి ఎమ్మెల్యేలూ వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ స్థానిక సమస్యలపై ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. అధికారం చేపట్టి వంద రోజులైనా ప్రజా సమస్యలనూ పట్టించుకోవడం లేదు. దీంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలతో అమీతుమీ తేల్చుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వంలో ప్రగతికి పడిన బాటలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

- వాగ్దానాలను గాలికొదిలిన ఎమ్మెల్యేలు
- మాచర్ల, గురజాలలో దుస్థితి
- ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం
- గత ప్రభుత్వంలో ప్రగతికి బాటలు



కేంద్రం అనుమతులు తీసుకొచ్చి వరికపూడిసెల ప్రాంతాన్ని, శంకుస్థాపన కోసం పరిశీలిస్తున్న అప్పటి ప్రభుత్వ విప్ పీఆర్కే, మంత్రి అంబటి తదితరులు (ఫైల్)



గత ప్రభుత్వంలో మాచర్ల నెహ్రూనగర్ వద్ద శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన బుగ్గవాగు మంచినీటి పథకం

వాగ్దానాలు ‘బ్రహ్మే’ండం.. ఆచరణ శూన్యం

మాచర్ల: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల సమయంలో వాగ్దానాలతో ఊదరగొట్టారు. మాచర్ల పట్టణానికి బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి మంచినీటిని తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.79 లక్షలతో చేపట్టిన పథకాన్ని పూర్తిచేస్తానని ప్రకటించారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో చేపట్టిన వరికపూడిసెల పనులను వేగంగా పూర్తిచేయిస్తానని బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చారు. మాచర్ల ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తానని, నాగార్జున సాగర్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని డాంభికాలు పలికారు. నాగార్జున సాగర్‌లోని బ్రహ్మానందపురం తండా సమీపంలోని ఇప్పటికే ఉన్న విమానాశ్రయాన్ని ఆధునికీకరించి విమానాలను నడుపుతామని బీరాలు పోయారు. వీటిల్లో ఏ ఒక్కటీ ఒక్క అంగుళం కూడా కదల్లేదు. పైగా ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు. దీంతో నియోజకవర్గ వాసులు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరపతి కోల్పోయిన యరపతినేని

సాక్షి నెట్‌వర్క్ (గురజాల) : ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. గెలిచి వంద రోజులు పూర్తయినా ఇచ్చిన వాగ్దానాలలో ఒక్కటీ ఆచరణలోకి రాలేదు. ఫలితంగా యరపతినేని ప్రజల్లో పరపతి కోల్పోయారు. ఆయన పనితీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. గురజాలను జిల్లా కేంద్రంగా చేస్తానని, ఇంటింటికీ కృష్ణా జలాలు తీసుకువచ్చి తాగునీటి సమస్య పరిష్కరిస్తానని యరపతినేని పగల్బాలు పలికారు. వంద రోజులైనా వీటి గురించి మాట్లాడడం లేదు. ఫలితంగా ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. గురజాల రెవెన్యూ డివిజన్ కేంద్రమైనా నగరపంచాయతీగానే మిగిలిపోయింది. దీనిని జిల్లా కేంద్రం చేస్తానని బీరాలు పోయిన యరపతినేని ఆ హామీ ఏమైందో ఇప్పుడు మాట్లాడడం లేదు.

మెరుగైన పాలనకు కృషి

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిన్నెల్లిలో గ్రామస్తులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, మాజీ ఎమ్మెల్సీ జంగా తదితరులు

మాచవరం/దాచేపల్లి/గురజాల/రెంటచింతల/మాచర్ల రూరల్/కారెంపూడి: మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు తావివ్వబోమని, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అంకరావు, టీడీపీ మండల కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, మండల నాయకులు రామారావు, వెంకట్రావు, స్థానిక నాయకులు జానీబాషా, దస్తగిరి, సుభాని, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- దాచేపల్లి: మండలంలోని గామాలపాడు సచివాలయం వద్ద సర్పంచ్ జంగా సురేష్ ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పలు గ్రామ పంచాయతీల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- గురజాల నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ చాగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- రెంటచింతల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం వాల్‌పోస్టర్లను ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది శుక్రవారం ఆవిష్కరించారు.
- మాచర్ల రూరల్ మండలం జమ్మల మడక గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓ కె.సరోజనీదేవి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు.
- కారెంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చారు.

అనుగురాజు యాదవ్ విగ్రహ కమిటీ ఎన్నిక



అధ్యక్షులుగా ఎన్నికైన ఆవుల జనార్దన్

పిడుగురాళ్ల: అఖండ పల్నాడును పరిపాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహ ఏర్పాటు కోసం పిడుగురాళ్ల పట్టణ కమిటీ ఎన్నికను గంగమ్మ తల్లి గుడి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సోదరులందరూ ఏకగ్రీవంగా ఆవుల జనార్దన్‌రావును విగ్రహ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణానికి తన వంతుగా లక్ష రూపాయల విరాళం ఇస్తానని జనార్దన్‌రావు ప్రకటించారు. కార్యక్రమంలో అనుగురాజు యాదవ్ విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులుగా మేకల ఆంజనేయులు, కొక్కెర పెద కొండలు ప్రధాన కార్యదర్శి కొర్రకూటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా జక్కుల అప్పారావు, కోశాధికారిగా యలగాల గోపి, చింతల లోకేష్‌తోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద కాలువలా రహదారి

రెంటచింతల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు మండల వాతావరణ శాఖ సూపర్ వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జూన్, జూలై నెలలలో సకాలంలో చిన్నపాటి వర్షాలు మాత్రమే కురవడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులను చేపట్టలేకపోయారు. మండలంలో ప్రస్తుతం పత్తి పంట పనులు పూర్తయ్యాయి. వరి దమ్ము చేసి నాట్లు వేసే పనులు, మిర్చి మొక్కలు వేసే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలో మిర్చి 6,284 ఎకరాలు, పత్తి 2,836 ఎకరాలు, వరి 6038 ఎకరాలు, కంది 2,165 ఎకరాలు, అపరాలు 306 ఎకరాలు మొత్తం 17,629 ఎకరాలలో సాగైనట్టు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కేసానుపల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శోభారాణి



మాచర్లలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు

దాచేపల్లి/మాచర్ల : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ ఎం.శోభారాణి చెప్పారు. కేసానుపల్లి గ్రామంలో స్వచ్ఛత హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అధికారులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శోభారాణి మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ చెట్టి పాగు ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామకోటయ్య, నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

- మాచర్ల పట్టణంలోని పలు ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని గుర్తించిన మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు శుక్రవారం ఉదయం నుంచి పలు వార్డులలో పర్యటించి దగ్గరుండి పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించారు.

• ఆనంద ‘ఖేలా’



రెంటచింతలలో కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఎంపీడీఓ యాల్లా మహాలక్ష్మి



పిడుగురాళ్ల హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలు పలు చోట్ల ఉత్సాహంగా సాగుతున్నాయి. పిడుగురాళ్ల, రెంటచింతల మండలాల్లో శుక్రవారం ఆటల పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ –14, అండర్ –17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మొత్తం 320 మంది విద్యార్థులు పోటీల్లో ప్రతిభ చూపారు. ఎంపిక పోటీలు శనివారం కూడా కొనసాగనున్నాయి. పీడీలు దానియేలు, ఎం.మోహన్‌కుమారి, సౌజన్య, శివరామకృష్ణ, స్కూల్ గేమ్స్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి, పీఈటీ సాతులూరి సురేంద్రబాబు తదితరులు పోటీలను పర్యవేక్షించారు. రెంటచింతల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి అండర్ 14, అండర్–17 ఆటల పోటీలను ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి ప్రారంభించారు. కొద్దిసేపు ఎంపీడీఓ కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. సుమారు 200 మంది కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలలో పాల్గొన్నట్టు స్కూల్ గేమ్స్ మండల కో–ఆర్డినేటర్ కత్తి రవి తెలిపారు. శనివారమూ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంఈఓ–2 వై.శివనాగేశ్వరరావు, సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ పీటర్ పాపయ్య, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, పీఈటీలు బ్రహ్మయ్య, సుభాని, అంజలి, సురేష్, వెంకటేష్, ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు. – పిడుగురాళ్ల/రెంటచింతల



మాచర్ల నియోజకవర్గ పోటీలకు ఎంపికైన రెంటచింతల విద్యార్థినులతో స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, పీఈటీలు



పిడుగురాళ్లలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



రెంటచింతలలలో హోరాహోరీగా కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

గుండెపోటుతో ఎంపీహెచ్ఏ సీతారామిరెడ్డి మృతి



రెంటచింతల: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఏగా విధులు నిర్వహిస్తున్న దుగ్గిరాల సీతారామిరెడ్డి(50) శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతి చెందారు. ఇటీవల విజయవాడ పరిసర ప్రాంతాలలో వరదలు వచ్చిన నేపథ్యంలో సీతారామిరెడ్డి సహాయక చర్యల్లో పాల్గొన్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా శుక్రవారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందారు. 23ఏళ్లపాటు కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసిన సీతారామిరెడ్డి 2024 ఏప్రిల్‌లో రెగ్యులర్ అయ్యారు. ఆయనకు భార్య రాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ హేమ, మలేరియా సబ్ యూనిట్ పర్యవేక్షణ అధికారి సీహెచ్. అంకమ్మరావు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది సీతారామిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆరోగ్యమే మహా భాగ్యం



అచ్చంపేట: గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని తాళ్ల చెరువులో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు రోజులో కొంత సమయం యోగా చేయడం ద్వారా మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, నార్మల్ డెలివరీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఆకు కూరలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని వాటిని తరచూ తింటూ ఉండాలన్నారు. బాలింతలు బిడ్డకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదె ఇన్నారెడ్డి, తుమ్మా విజయ సుధాకర్‌రెడ్డి, సచివాలయ ఎస్ఎం ఎం.సుశీల, మహిళా పోలీస్ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి: సత్తెనపల్లి రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదికలో ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే తాను స్వయంగా కంపెనీలతో చర్చించి, నియోజక వర్గానికి తీసుకొని రావడం జరిగిందన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఇద్దరికి గాయాలు

పిడుగురాళ్ల: ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనటంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పట్టణ ఎస్ఐ ఎం.మోహన్ తెలిపిన వివరాల మేరకు బ్రాహ్మణపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న ఆటోను హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొనటంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం నర్సరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కామేపల్లికి గ్రామానికి చెందిన క్షతగాత్రుని భార్య ఎ.సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో బేకరీ షాపు దగ్ధం



విజయపురిసౌత్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ షాపు దగ్ధమైన ఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో శుక్రవారం జరిగింది. విజయపురిసౌత్‌లోని సీ టైపులో నివాసం ఉంటున్న పెద్దారపు సైదులు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బేకరీ, స్వీట్ షాపు నిర్వహిస్తున్నాడు. ఉదయం 4 గంటలకు బేకరీకి మంటలు వ్యాపించగా స్థానికులు సైదులుకు సమాచారం ఇచ్చారు. మాచర్ల ఫైర్ స్టేషన్‌కూ సమాచారం అందజేశారు. ఫైర్ ఇంజిన్ ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే యత్నం చేసినా అప్పటికే షాపు పూర్తిగా దగ్ధమైంది. షాపులోని ఫ్రిజ్, ఫర్నిచర్‌తోపాటు సరుకు మొత్తం కాలిబూడిదైంది. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని షాపు యజమాని సైదులు చెప్పారు.

నేడు కారెంపూడిలో ఎమ్మెల్యే పర్యటన

కారెంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణ, రూరల్ ప్రాంతాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ. రామయ్య శుక్రవారం తెలిపారు. ఎన్ఎస్ డ్యాం ఫీడర్ పరిధిలో 33 కేవీ సబ్ స్టేషన్ ప్రాంతంలో రోడ్డు క్రాసింగ్ వర్కులు జరుగుతున్న నేపథ్యంలో 33కేవీ రైట్ కెనాల్ సబ్‌స్టేషన్, పాత మాచర్ల, వినాయకుని గుట్ట, ఎంఎస్ఆర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.